
# ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్‌గా గునిగంటి కమలాకర్

❖ ప్రభుత్వం–గ్రామ పాలన మధ్య సమన్వయమే లక్ష్యం
❖ పంచాయతీ రాజ్ బలోపేతానికి సర్పంచ్‌ల సహకారం అవసరం






**దశ,మహబూబాబాద్:** రంగారెడ్డి జిల్లాలోని పంచాయతీ రాజ్ ఛాంబర్‌లో తెలంగాణ పంచాయతీ రాజ్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సర్పంచుల చైతన్య సదస్సులో ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్‌గా గుండంరాజుపల్లి సర్పంచ్ గునిగంటి కమలాకర్ ను నియమించారు. తెలంగాణ పంచాయతీ రాజ్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి ఈ నియామకాన్ని ప్రకటించారు..

**ప్రజాపాలనలో ప్రభుత్వానికి పూర్తి సహకారం...**

గుండంరాజుపల్లి గ్రామంలో జన్మించిన గునిగంటి కమలాకర్ కింది స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ గ్రామస్థాయిలో గుర్తింపు పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హుల వరకు చేరేలా సర్పంచులు కీలక పాత్ర పోషించాలని ఆయన ఎప్పటికప్పుడు సూచిస్తున్నారు.

**ప్రభుత్వ విధానాల అమలే ప్రాధాన్యం...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచిగా ఎన్నికై గ్రామాభివృద్ధికి ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అమలులో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరిస్తూ పనిచేస్తున్నారు.

**సమన్వయంతో సమస్యల పరిష్కారం**

కన్వీనర్‌గా ఎన్నికైన అనంతరం గునిగంటి కమలాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలకు సర్పంచ్‌ల మద్దతు కీలకమని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సర్పంచులు ఎదుర్కొంటున్న అంశాలను ప్రభుత్వ దృష్టికి సానుకూలంగా తీసుకెళ్లి, సమన్వయంతో పరిష్కారం సాధిస్తామని తెలిపారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కవులు దాశరథి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు జన్మించిన ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి జిల్లా స్థాయిలో కీలక బాధ్యత చేపట్టడం పట్ల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.




## నూతన యాదవ 200 సర్పంచులను ఘనంగా సన్మానం



**దశ ఓయూ:** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో యాదవులు ఘన విజయం సాధించాలని యాదవ సంఘం నాయకుడు అనిల్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ నాచారంలో ఏఎన్ఆర్ గార్డెన్ లో నూతన యాదవ 200 సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సనత్ నగర్ ఎమ్మెల్యే పదసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ ద్వారా ఎక్కువ మంది సర్పంచులు అయ్యారు అదేవిధంగా రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో యాదవులు రిజర్వేషన్ ఉపయోగించుకుని ఘనవిజయం సాధించాలని అన్నారు. నూతన సర్పంచులు నీతి నిజాయితీతో పనిచేసి ప్రజలకు సేవ చేయాలని ఈ వేడుకదార నూతన సర్పంచులకు సూచన చేసామని నిర్వాహకులు తెలిపారు.

## యాదగిరిగుట్ట పట్టణంలో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ చేసిన బీర్ల ఐలయ్య



**దశ,యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ కార్యలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సీఎం రిలీఫ్ ఫండ్ 'కల్యాణ లక్ష్మీ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గం లోని ఎనిమిది మండలాలకు సంబంధించిన సుమారు 200 మంది సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సుమారు 100 కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మీ వంటి పథకాల ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ ప్రభుత్వ పథకాలు పేద, కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కీలకంగా పనిచేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సాయం వల్ల ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వేధింపులు తగ్గుతున్నాయని గుర్తుచేశారు.కళ్యాణ లక్ష్మి చెక్కులు స్వీకరించే యువతులకు ఇది పెళ్లిళ్ల ఖర్చులు, కుటుంబ పరిరక్షణకు చాలా ఉపకారపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంగమ్మ గుడి నిర్మాణం కు అనుమతి ఇవ్వాలని గంగపుత్రుల వినతి



❖ సర్పంచ్, ఉపసర్పంచ్ లకు గంగపుత్ర సంఘం సన్మానం

**దశ ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో గంగమ్మగుడి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఎల్లారెడ్డిపేట గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్,ఎలగందుల నర్సింలుకు ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి లకు ఆదివారం వినతి పత్రం అందజేశారు.నూతనంగా ఎన్నికైన శుభ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు ను ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డిలను గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సన్మానించారు.తమ తాతల కాలం నుండి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించడం జరుగుతుందని వినతి పత్రంలో వారు పేర్కొన్నారు. కొన్ని ఆటంకాల వల్ల గుడి నిర్మాణం జరగలేదని గ్రామ ప్రజలు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించుకోవడం కోసం అన్ని కుల సంఘాలకు కుల దేవతల గుళ్ళు ఉన్నట్లు గంగపుత్రులకు కూడా గంగమ్మ తల్లి దేవాలయం నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని వారు లేఖలో సర్పంచ్ ఉప సర్పంచ్ కు విజ్ఞప్తి చేశారు.గంగపుత్ర సంఘం అధ్యక్షులు పెంటం పద్మయ్య , ఉపాధ్యక్షులు పెంటం దేవయ్య, సహాయ కార్యదర్శి సోమ్ గారి నరసయ్య, కోశాధికారి పెంటం మైసయ్య, సంఘం ప్రతినిధులు పెంటం దేవయ్య, సోంగారి బాల నరసయ్య, చిట్టంపల్లి సుధాకర్, పెంటం దేవయ్య, మానుకోల సుధాకర్, జర్నలిస్ట్ పెంటం శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు పెంటం మల్లయ్య,పెంటం లక్ష్మణ్, ఆంధ్రపు నర్సయ్య,పెంటం ప్రవీణ్ లు సర్పంచ్ ఎలగందుల నర్సింలుకు ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి లకు వినతిపత్రం సమర్పించారు.




## సుధాకర్ విజన్ క్లబ్ , వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు, వంటల పోటీలు

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సుధాకర్ విజన్ క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు విద్యానగర్ లోని శ్రీ రామలింగేశ్వర దేవాలయం వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు, వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఐపిఈ సింగరికొండ రవీందర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యానగర్ ని రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద జరిగే ముగ్గుల పోటీలు వంటల పోటీలలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి వెట్ గ్రైండర్, రెండవ బహుమతి మిక్సి, మూడవ బహుమతి కుక్కర్ ను శ్రేష్ట హాస్పిటల్ వారి సహకారంతో అందజేస్తామని తెలిపారు.

అలాగే వంటల పోటీలలో విజేత లకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు చీరలను గండూరి షాపింగ్ మాల్ యజమాని గండూరి క్రపాకర్ సహకారంతో అందజేస్తామని, ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శివసాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీ వారి ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐపిసిలు పబ్బతి వేణుమాధవ్, బిక్కుమళ్ల కృష్ణ, వెంపటి శబరినాథ్, గో సేవ జిల్లా ఇంఛార్జ్ కలకోట లక్ష్మయ్య, ఆర్ఎస్ కలకోట అనిత, ఆర్ సి నాగరాజు, శ్రీరంగం రాము లు పాల్గొన్నారు.

## రబీ సీజన్ లో నాటిన వరి పైరు లో తగు జాగ్రత్తలు పాటించాలి



**దశ, నడిగూడెం :** నడిగూడెం మండల గ్రామ రైతు లు రబీ సీజన్లో (వేసంగి) వరి నాట్లు మరియు నేరుగా వరి విత్తనాలు సాగు చేసిన రైతులు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత వాతావరణం పరిస్థితులలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున సాగుచేసిన వరి పొలాల్లో ఉదయం పూట నీరు నిలువ చేసి సాయంత్రం పూట నీటి ని వెళ్ళదీయాలి లేనిచో చలి ప్రభావం వలన లేత దశలో ఉన్న వరి పొలాలు ఎర్రబారి జింకు లోపం తో ఫైర్ ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుంది అలాగే యూరియాను తక్కువ మోతాదులో వినియోగించాలి జింకులోపం నివారణకు చిలేటెడ్ జింకు లేదా మల్టీప్లెక్స్ జింకును పైరు వయసును బట్టి పిచికారి చేసుకోవాలి జింకు లోపం వలన పైరు ఎదుగుదల లోపించి దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ఆరుతడి పద్ధతులు నీటిని వినియోగించిన యెడల మంచి ఫలితాలు పొందవచ్చు.

## సంక్రాంతి పండుగ ఆఫర్లు అంటూ సైబర్ మోసాలు

❖ ఫేక్ షాపింగ్ ల ఆఫర్లు పండుగ డిస్కౌంట్ల పేరుతో మోసాలు
❖ సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
❖ కారేపల్లి సిఐ నునావత్ సాగర్



**దశ, కారేపల్లి :** సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆన్లైన్ షాపింగ్ రీఛార్జిలు ట్రావెల్ బుకింగులు భారీ డిస్కౌంట్ లిమిటెడ్ టైం ఆఫర్ సంక్రాంతి స్పెషల్ గిఫ్ట్ ఫేక్ షాపింగ్ ఆఫర్లు పండగ డిస్కౌంట్ నకిలీ వెబ్ సైట్ల ద్వారా భారీ తగ్గింపు అని చూపించి మోసం చేస్తారని ఇలా ఆఫర్ల పేరుతో ఆకర్షణీయమైన సందేశాలతో ప్రజలను మభ్యపెడుతూ సైబర్ నేరగాళ్లు మోసం చేసే ప్రయత్నం చేస్తారని కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సింగరేణి మండల సిఐ నునావత్ సాగర్ ఆదివారం పేర్కొన్నారు. నకిలీ వెబ్ సైట్లు ఫేక్ షాపింగ్ యాప్ లు మరియు వ్యక్తిగత వివరాలు బ్యాంకు సమాచారంపొందెందుకు ప్రయత్నిస్తారంటున్నారు. చెల్లింపుల కోసం నకిలీ యాప్ ను క్యూఆర్ కోడ్లు కూడా -- ఉపయోగిస్తుంటారన్నారు. కొంతమంది మోసగాళ్లు ముందుగా తక్కువ ధర చూపించి చెల్లింపు చేసిన తర్వాత పూర్తిగా కనుమరుగవుతుంటారన్నారు. ప్రత్యేకంగా ఆన్లైన్ లక్కీ డ్రా కూపన్లు ఉచిత బహుమతుల పేరుతో లింకులు పంపి మొబైల్ లో మాల్వేర్ ఇన్ స్టాల్ అయ్యేల చేసి డేటా దోపిడీ చేస్తూ ఉంటారన్నారు దీనివల్ల ఖాతాలో నుంచి డబ్బు మాయం కావడం సోషల్ మీడియా అకౌంట్లు హ్యాక్ కావడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయన్నారు. కారేపల్లి సిఐ ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియని ఆఫర్ లింకులపై క్లిక్ చేయవద్దు వెబ్ సైట్లు యాప్ ల ద్వారా కొనుగోలు చేయవద్దు బ్యాంకు వివరాలు ఎవరికి ఇవ్వవద్దు అధికారిక షాపింగ్ యాప్ లు వెబ్ సైట్లుకు మాత్రమే ఉపయోగించండి సోషల్ మీడియాలో కనిపించే అతిగా తక్కువ ధరల ఆఫర్లను నమ్మవద్దు సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫోన్ చేయాలి. సంక్రాంతి పండుగలు ఆనందంగా జరుపుకోవాలంటే సైబర్ మోసాల పట్ల అప్రమత్తత అత్యవసరమని జాగ్రతే భద్రత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సీఐ నునావత్ సాగర్ తెలిపారు.

## వెంకటేష్ గురు స్వామి కుటుంబం మొత్తం 30 ఏళ్లుగా మాలధారణ



**దశ ఓయూ:** సికింద్రాబాద్ నియోజకవర్గం లాలాపేట్ ఇందిరా నగర్ కు చెందిన కుటుంబం గత 30 సంవత్సరాలుగా అయ్యప్ప మాల ధరించి అయ్యప్ప స్వామినీ దర్శించుకుంటున్నారు. సందర్భంగా వెంకటేష్ గురు స్వామి మాట్లాడుతూ ఆరు మంది తమ కుటుంబ సభ్యులం ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామి మాల వేస్తున్నామని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి దయ వల్ల తామందరం సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా 18సార్లు అయ్యప్ప మాల వేసిన సిద్దు గురుస్వామి, 15 సంవత్సరాలుగా అంజమ్మ, లల్లు, ప్రభాకర్, నిఖిల్ లు అయ్యప్ప మాల ధరించి లాలాపేట్ నుండి అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి కట్టుకొని శబరి యాత్రకు బయలుదేరారు.

## మెగాస్టార్ చిరంజీవి నటించిన "మన శంకర వరప్రసాద్" చిత్రం సూపర్ హిట్ ఖాయం


❖ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన మెగాస్టార్ చిరంజీవి సంక్రాంతి మూవీ "మన శంకర వరప్రసాద్" చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ కావడం ఖాయమని సినీ గీత రచయిత అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మైటీ మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం

**మెగాస్టార్ చిరంజీవి "మన శంకర వరప్రసాద్"**

చిత్రంలో అద్భుతంగా నటించడం జరిగిందన్నారు. చిరంజీవి చిత్రాలలోనే ఇప్పటివరకు నంబర్ వన్ చిత్రంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కానీ కొంతమంది కుట్ర దారులు మెగాస్టార్ చిరంజీవి ప్రతిభను ప్రగతిని చూసి అసూయపడే వారు నెగటివ్ ట్రోల్స్ చేస్తూ చిత్ర విజయాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని కుట్రలు కుతంత్రాలు ఎన్ని చేసినా మెగాస్టార్ మన శంకర వరప్రసాద్ చిత్ర అఖండ విజయాన్ని ఆపలేరని అన్నారు. సంక్రాంతి పర్వదిన సందర్భంగా సోమవారం థియేటర్లలో "మన శంకర వరప్రసాద్" చిత్రం విడుదలవుతున్న శుభ సందర్భంగా ప్రేక్షకులు ఆదరించాలన్నారు. చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ చిత్రం అఖండ విజయాన్ని సాధించి బ్లాక్ బస్టర్ హిట్టుగా ఇండస్ట్రీ హిట్ గా విజేతగా నిలుస్తుందని మైటీ మెగాస్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు.



## చిన్న మేడారం సమ్మక్క–సారాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**దశ యాదగిరిగుట్ట:** రాజపేట మండలం కుర్రారం చిన్న మేడారం గ్రామంలో నిర్వహించనున్న సమ్మక్క-సారాలమ్మ జాతరకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమ్మక్క-సారాలమ్మ జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. జాతరను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. ప్రభుత్వం తరఫున జాతర నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ పురస్కారాల కార్యక్రమానికి ఎంపికైన మోతె రాజిరెడ్డి



**దశ రాజన్న సిరిసిల్ల జిల్లా:** కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో (ఐవిఎఫ్) స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా రక్తదాన కార్యక్రమాల్లో కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, వ్యక్తులకు జాతీయ పురస్కారాలను,2025వ సంవత్సరంలో మూడుసార్లు రక్తదానం చేసిన రక్తదాతలకు ఉత్తమ రక్తదాత పురస్కారాలను సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్ లో నిర్వహించడం జరుగుతుందని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్,గౌరవ అధ్యక్షులు డాక్టర్ వేద ప్రకాష్‌లు తెలిపారు. ఈ జాతీయ ఉత్తమ రక్తదాత పురస్కరానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకి చెందిన మోతె రాజిరెడ్డి ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో 79 మందికి ఈ యొక్క పురస్కారాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి అవార్డు గ్రహీతలు రావడం జరుగుతుందని,ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. అవార్డుకు ఎంపికైన వారందరికీ అభినందనలు తెలియజేశారు. మరింత సామాజిక సేవా బాధ్యతను పెంపొందించాలని ఉద్దేశంతోనే ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

## క్రీడాకారులకు బాట్,బాల్ లను బహుకరించిన తిరుపతి రెడ్డి



**దశ ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో యువకులు క్రికెట్ ఆడుకోవాడినికి బాట్,బాల్ లు కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల యువకులకు బ్యాట్ , బాల్ లను అందించారు.ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని,ఆటలతోనే ఉత్సాహం వస్తుందని అని పేర్కొన్నారు. ఇకముందు కూడా యువకులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శబరి యాత్రకు బయలుదేరిన లాలాపేట్ అయ్యప్ప స్వాములు



**దశ ఓయూ:** అయ్యప్ప దీక్ష చేపట్టి 41 రోజులపాటు కఠినమైన నియమ నిబంధనలు పాటించి శబరి యాత్రకు బయలుదేరారు లాలాపేట్ అయ్యప్ప స్వాములు. రమేష్ గుప్తా గురు స్వామి ఆధ్వర్యంలో లాలాపేట్ లోని అయ్యప్ప దేవాలయంలో 30 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని శబరి యాత్రకు బయలుదేరారు. స్వామియే శరణమయ్యప్ప నినాదాలతో ఊరేగింపుగా లాలాపేట్ ప్రధాన రహదారి వెంబడి నడుచుకుంటూ పాదయాత్ర సాగించి అనంతరం కాచిగూడ రైల్వే స్టేషన్ కు బయలుదేరారు. అక్కడి నుండి ట్రైన్ లో వెళ్లి కేరళలోని శబరిమల కొండపై వెలసిన అయ్యప్ప స్వామిని దర్శించుకుని అయ్యప్పకు ఇరుముడి సమర్పించి శబరి యాత్ర ముగించుకొని రానున్నారు. ఈ యాత్రలో అయ్యప్ప స్వాములు ఎల్.ఎల్.బి శ్రీనివాస్, బాబా అశోక్, మామ శీను, రైల్వే శీను, మల్లికార్జున్, పోలీస్ వెంకట్ తో పాటు పలువురు అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలుదేరారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు




**దశ సూర్యాపేట ప్రతినిధి :** సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం సద్దుల చెరువు సమీపంలో వారు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో అగ్రవర్ణాల పాలన అగమ్య గోచరంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అందరూ ఏకం కావాలని, తీన్మార్ మల్లన్న సారధ్యంలో భవిష్యత్తులో రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. 97% శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని 3% శాతం ఉన్న అగ్ర వర్ణాలను గద్దె దించే సమయం వచ్చిందని అన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో ఎస్సీ ఎస్టీ బీసీలను నిలబెట్టి గెలిపించుకుంటామని అన్నారు. కుల మతాలకు సంబంధం లేకుండా ముగ్గుల పోటీలకు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారని అన్నారు. సూర్యాపేట చరిత్రలోనే ఇంతమంది మహిళలు పాల్గొన్నారు అని సూర్యపేట ప్రజలందరూ చర్చించుకుంటున్నారని అన్నారు. ఈ ముగ్గుల పోటీకి వచ్చిన మహిళలందరికీ వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం గెలిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్, జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య ప్రధాన కార్యదర్శి మీరు అక్బర్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు చాంద్ పాషా, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి నాగరాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నాచారం హెచ్ఎంపి నగర్ డివిజన్లో ముగ్గుల పోటీలు



**దశ, ఓయూ :** భారతీయ జనతా పార్టీ నాచారం హెచ్ఎంటి నగర్ డివిజన్లో అన్నపూర్ణ కాలనీలో ముగ్గుల పోటీ కార్యక్రమం జిల్లా అధికార ప్రతినిధి పోతదని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు గౌరవనీయులు ప్రభాకర్ పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేయడం జరిగింది మరియు మొదటి బహుమతి జోష్నా, రెండో బహుమతి K మంజుల, మూడో బహుమతి, G అండాలు కార్యక్రమము డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల వాణి మరియు సీనియర్ నాయకుడు గంధ మల్ల గోపి చొరవతో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చంద్రమౌళి , ఉపాధ్యక్షుడు వెంకట నాయక్, రమేష్, సురేందర్, శ్రీనివాస్ యాదవ్, శేఖర్ గుప్తా, కాందారి వెంకటేష్ , సంపత్,పార్వతి మరియు ఇతర నాయకులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవి ఇచ్చారు.. పవర్ ఇవ్వలేదు - కొలువుదీరినా అందని 'చెక్' పవర్!

- *కొత్త పాలకవర్గాలకు తప్పని నిరీక్షణ - 15 రోజులైనా అధికారుల గుప్పిట్లోనే 'డిజిటల్ కీ'!*
- *కుర్చీ ఉంది కానీ అధికారం లేదు.. కొత్త పాలకవర్గాలకు అందని ఆర్థిక స్వేచ్ఛ!*




**దశ,యాదాద్రి:** గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా చెప్పుకునే గ్రామ పంచాయతీలు నేడు అధికారాల లేమితో నిర్వీర్యంగా మారుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొంది బాధ్యతలు స్వీకరించి పక్షం రోజులు (15 రోజులు) గడిచినా, సర్పంచులకు అందాల్సిన ఆర్థిక అధికారాలు (చెక్ పవర్) మాత్రం ఇంకా అందలేదు.డిజిటల్ సంతకాలపైనే పెత్తనం ప్రస్తుతం గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణ అంతా ఆన్‌లైన్ వ్యవస్థలోకి మారింది. ప్రతి చెల్లింపుకూ 'డిజిటల్ సిగ్నేచర్', 'లాగిన్ యాక్సెస్' తప్పనిసరి. కానీ, ఈ డిజిటల్ కీలు మరియు ఆన్‌లైన్ అనుమతులు ఇప్పటికీ అధికారుల (పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు) వద్దే ఉన్నాయి.నిలిచిపోయిన అభివృద్ధి పనులు తాగునీటి మోటార్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య కార్మికుల వేతనాలు వంటి అత్యవసర పనులకు కూడా సర్పంచులు నిధులు ఖర్చు చేయలేకపోతున్నారు. "నిధులు ఉన్నాయి కానీ వాడుకునే అధికారం లేదు" అని సర్పంచులు వాపోతున్నారు. సాఫ్ట్‌వేర్ సాకులు అధికారులు మాత్రం "సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్, ఆడిట్ క్లియరెన్స్ పూర్తయ్యాక డిజిటల్ కీలు అప్పగిస్తాం" అని చెబుతున్నారు. కానీ దీనికి ఎంత సమయం పడుతుందో స్పష్టత లేదు.

**నిర్వీర్యమవుతున్న 73వ రాజ్యాంగ సవరణ**

రాజ్యాంగం ప్రకారం పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో అధికారుల ఆధిపత్యం కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రజాప్రతినిధుల డిమాండ్**

గ్రామాల్లో అభివృద్ధి వేగవంతం కావాలంటే వెంటనే సర్పంచులకు డిజిటల్ కీలు, చెక్ పవర్ అప్పగించాలని, అధికారుల పాత్ర కేవలం పర్యవేక్షణ వరకే పరిమితం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే గ్రామ పాలన వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## వెంకటాద్రి టౌన్షిప్ లేఔట్ ను పారదర్శకంగా ముందు కు తీసుకెళ్తాం

- *ఎంపీ ఈటెల రాజేందర్ టైం ఇస్తే అన్ని విషయాలు వెల్లడిస్తా..వెంకటాద్రి టౌన్షిప్ యజమాని ఏ. వెంకటేష్ యాదవ్*



**దశ ఓయూ:** ఘట్కేసర్ రెవెన్యూ పరిధిలోని ఏకశిల వెంచర్, వెంకటాద్రి వెంచర్ లో ఉద్రిక్తత ఇరు వర్గాల పరస్పర దాడులు జరగగా... వెంకటాద్రి టౌన్షిప్ యజమాని వెంకటేశ్వర్లు తార్నాక లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వెంకటాద్రి టౌన్షిప్ లేఔట్ ను పారదర్శకంగా ముందు కు తీసుకెళ్లామని కానీ కొంతమంది పక్క వెంచర్ వాళ్ళు అనవసరంగా అలజడి సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సరైన అన్ని పత్రాలు ఉన్నాయని తెలిపారు.పక్క వంచకు సంబంధించిన హద్దులు వారు చూసుకోలేక వెంకటాద్రి టౌన్షిప్ లోకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ ఈటెల రాజేందర్ టైం ఇస్తే అన్ని విషయాలను తెలియజేస్తానని తన వద్ద ఉన్న పత్రాలను కూడా చూపిస్తానని తెలిపారు. వెంచర్కు సెక్యూరిటీగా ఉన్న వారిమీదికి దాడి చేయడానికి వచ్చారని దీనితో వారు పక్కన వారిని సంప్రదించగా వాళ్ళు సపోర్టుగా వచ్చారని తెలిపారు.దాడి జరుగుతుందని పోలీసులకు తెలిపిన స్పందించకపోవడంతో సెక్యూరిటీ స్థానికులకు విషయం తెలుపగా వారు వచ్చి అడ్డుకున్నారని తెలిపారు. అంబర్పేట్ కు సంబంధించిన కొంతమందిని తీసుకొచ్చి వారి సర్వే నంబర్లు కాకుండా వెంకటాద్రి టౌన్షిప్ సర్వే నంబర్లకు వచ్చి అలజడి సృష్టిస్తూ దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు.

## దహన సంస్కారాలలలో అన్నీ తానైన గండూరి కృపాకర్




**దశ సూర్యాపేట ప్రతినిధి :** 45వ వార్డులోని ప్రజలకు ఏ ఆపదొచ్చిన ముందుండి అన్ని తానై నిలిచే ప్రజానాయకుడు గండూరి కృపాకర్. శనివారం ఆయన వార్డులో అద్దె ఇంటిలో ఉంటున్న ఆర్యవైశ్య కులానికి చెందిన చెన్నూరు వెంకటేశ్వర్లు గుండెపోటుతో మరణించడంతో ఇంటి యజమాని దహన సంస్కారాలకు అనుమతి ఇవ్వలేదు. ఈ విషయమై వార్డు ప్రజలు గండూరి కృపాకర్ ను సంప్రదించగా వార్డు ప్రజల సౌకర్యార్థం ఉచితంగా ఏర్పాటుచేసిన తన వాటర్ ప్లాంట్ లో ఆశ్రయం ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం ఆయనే స్వయంగా పాడే మోసి దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు ముందుండి తమ సేవలను అందించారు. నిజమైన ప్రజా నాయకుడు గండూరి కృపాకర్ అంటూ వార్డు ప్రజలు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మరణించిన వారినీ స్మశాన వాటికకు తీసుకపోవడానికి ఉచితంగా వైకుంఠ రథాలు ఏర్పాటు చేసినట్టుగానే సూర్యాపేటలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న వారి కుటుంబ సభ్యులలో ఎవరైనా మరణించినట్లయితే దాన సంస్కారాలు చేసుకోనే విధంగా ప్రభుత్వం వైకుంఠ భవనాలు నిర్మించాలని కోరారు.

## నేడు స్టేడియంలో ముగ్గుల పోటీలు

- *సాయంత్రం మూడు గంటలకు ప్రారంభం*
- *గెలుపొందిన వారికి నగదు బహుమతులు*
- *పోటీలకు హాజరుకానున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రామ సహాయం*
- *పోటీలకు వేదిక సర్వం సిద్ధం*



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళ కాంగ్రెస్, రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3 గంటల నుండి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్టు భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు దేవిప్రసన్న తెలిపారు. ఆదివారం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్ ల నుండి మహిళలు పాల్గొంటారని విజేతలకు రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘు రాంరెడ్డి బహుమతులు అందిస్తారని తెలిపారు. 1వ బహుమతి 30 వేలు, 2వ బహుమతి 25 వేలు, 3వ బహుమతి 20 వేలు, 4వ బహుమతి 15 వేలు, 5వ బహుమతి 10 వేలు, కన్సోలేషన్ బహుమతులు (ఐదుగురికి) 5 వేలు చొప్పున ఇవ్వనున్నామన్నారు. ఇవే కాక ముగ్గుల పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఆకర్షణీయమైన బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. పోటీలో పాల్గొనే వారు సొంతంగా ముగ్గులు రంగులు తెచ్చుకోవాలని, కేవలం 1 గంటలోనే ముగ్గు వేయాలని విజేతల ప్రకటన అంతిమ నిర్ణయం జడ్జిలదేనని తెలిపారు. ఇప్పటికే ఈ పోటీలకు పేర్లను నమోదు చేసుకుంటున్నారు. పోటీల ప్రారంభ సమయానికి ముందు వరకు కూడా పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఈ కింద ఉన్న నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో ఐఎన్టీయుసి వైస్ ప్రెసిడెంట్స్ ఎండి రజాక్, పితాంబరం, రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు కరీం పాషా, ఓబీసీ వెంకట్ యాదవ్, మహిళ నాయకురాళ్లు ఆకునూరి సుప్రియ, హైమావతి, రమాదేవి, పుష్పలత, అమడగాని రాజకుమారి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ పదవి ప్రమాణ స్వీకారోత్సవం



- *అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మడిపడిగా శ్రీనివాస్ గుప్తా*
- *నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించిన నేతి రాములు గుప్త*

**దశ ఓయూ:** తార్నాక డివిజన్లోని లక్ష్మీ నగర్ శాంతినగర్ లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ పదవి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం లాలాపేట్ లోని తక్షశిల స్కూల్ ఆవరణలో ఘనంగా జరిగింది. గౌరవ అధ్యక్షులు నేతి రాములు గుప్త నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మడిపడిగా శ్రీనివాస్ గుప్తా తో పాటు నూతన కమిటీ తో ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడారు. నూతన కమిటీ అధ్యక్షులు మడిపడిగ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎలగందుల లక్ష్మణ్, పందిరి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి ఇంగు వెంకటేశ్, కోశాధికారి చిదిరే వీర బద్రయ్య, అదనపు కోశాధికారి నీలా రమేష్, మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు ఇంగు వీణ, అధ్యక్షురాలు ఉప్పల లక్ష్మి, ఉపాధ్యక్షురాలి గా మడిపడిగ అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి ఇర్కుల వర లక్ష్మి, కోశాధికారి కోటపల్లి రమ, వైశ్య భవన్ ట్రస్ట్ కోశాధికారిగా ఎనిశెట్టి సూర్యనారాయణ నియామకం అయ్యారు. అధిష్టాన వర్గం ఎనిశెట్టి కృష్ణ, కాపర్తి ఇంద్రయ్య, ముక్కాల రవి ప్రకాష్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాత కార్యవర్గం మాజీ కోశాధికారి ఎనిశెట్టి భాస్కర్, మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీదేవి, మాజీ కోశాధికారి తొడుపునూరి స్వాతితో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 'వీబీజీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి!

- *ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదు*
- *గ్రామసభల హక్కులను ఢిల్లీ పరం చేస్తారా?*
- *నిరసనలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు*
- *మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధారావత్ బద్రు నాయక్ ధ్వజం.*



**దశ, కారేపల్లి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలు గ్రామీణ భారతానికి శాపంగా మారాయని, తక్షణమే ( వీబిజీ రామ్ జీ) చట్టాన్ని రద్దు చేయాలని కారేపల్లి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధారావత్ బద్రు నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సింగరేణి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా బద్రు నాయక్ మాట్లాడుతూ.. " మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం జి ఎన్ ఆర్ ఇ జిఎస్ ) స్థానంలో తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్' (వీబీజీ రామ్ జీ) చట్టం పేద ప్రజల పొట్ట కొట్టేలా ఉంది. ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాదు, గ్రామీణ ప్రజల హక్కులను కాలరాయడమే" అని మండిపడ్డారు. ఈ నిర్ణయం వల్ల దళిత, గిరిజన, ఆదివాసీ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని, ముఖ్యంగా మహిళల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు ఆ నిర్ణయాధికారం ఢిల్లీ చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరం. స్థానిక పాలనను నిర్వీర్యం చేస్తూ కేంద్రం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది" అని ఆయన విమర్శించారు. కనీస వేతనం కూడా అందక కూలీలు దోపిడీకి గురవుతారని, దీనివల్ల గ్రామాల్లో నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతాయని హెచ్చరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు చొరవ తీసుకుని నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు లేదా ఆమరణ దీక్షలు చేపట్టి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పేదోడి పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలబడి ఈ నల్ల చట్టాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్రావుకు స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు 2026 ప్రధానం

**దశ ఓయూ:** స్వామి వివేకానంద సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచ వేదికపై ఎలుగెత్తి చాటారని భారతీయ జనతా పార్టీ మరియు మాజీ శాసన మండలి సభ్యులు N. రామచంద్రరావు అన్నారు. శనివారం తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తార్నాకలోని ఆయన నివాసంలో స్వామి వివేకానంద 164వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడపాలని దేశ సమగ్రత, ఐక్యదాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ అవినీతికి, అరాచకాలకు, అక్రమాలకు, సాంఘిక దురాచారాలకు యువత వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జాతీయ పర్యావరణవేత్త ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లయన్. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ యువత రేపటి భారతదేశానికి బలమైన పునాదులని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గత 45 సంవత్సరాలుగా విద్యార్థి, యువజన విభాగాల్లో నిరంతరం సేవలందిస్తూ, ప్రముఖ హైకోర్టు న్యాయవాదిగా ఎన్నోవేల మందికి చట్టం, న్యాయం పట్ల అవగాహన శిబిరాలు నిర్వహించి జాగృతి చేసినందుకు, భారతీయ జనతా పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి శాసనమండి సభ్యులుగా గెలిచి నేడు రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా ఎనలేని సేవలందిస్తున్న శ్రీ ఎన్. రామచంద్రరావుకు ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం నుండి నుండి ఒక్కరికి ఇచ్చే స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు 20 26 ను మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తో పాటు కార్యదర్శి ప్రొఫెసర్ మహమ్మద్ ఆక్తేర్ అలీ, ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ చౌహాన్, విద్యావేత్తలు, టిఐఎఫ్ కోఆర్డినేటర్ జి వేణుగోపాల్ తదితరులు రామచంద్రరావుకు పూలమాల, శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రధానం చేసి అభినందించారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.